క్లుప్తంగా

రేపు వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంపై సమావేశం

మునగపాక: వేంకటేశ్వర స్వామి, రామాలయ నిర్మాణంపై స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఈ నెల 21న గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ పెద్దలు సమావేశానికి హాజరుకావాలని కమిటీ కోరింది.

లాటరీబళ్లాట నిర్వాహకుల అరెస్టు

మునగపాక: మండలంలోని వెంకటాపురం సమీపంలో శుక్రవారం లాటరీ బళ్లాట నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తెలిపారు. వెంకటాపురంలో లాటరీబళ్లాట నిర్వహిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు దాడి చేసినట్టు చెప్పారు. నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.6,700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆలీ చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. ప్రజా ప్రతినిధులు, ధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటిపన్నుల వసూలు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. వెలుగు ఏపీఎం కొండమ్మ, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన కులగణన సర్వే



కులగణన సర్వే పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: కులగణన సర్వేను త్వరితగతిన చేపట్టాలని ఈవోఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నామవరం, గోపాలపట్నం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు సూచనలు చేశారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



చినపాచిలలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు, ధార్మిక సంఘాల సభ్యులు

రావికమతం: అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చినపాచిలలో నిర్వహించారు. గ్రామంలో వైష్ణవీ మాత ఆలయం నుంచి భారీ ర్యాలీగా ప్రధాన వీధుల్లో తిరిగారు. వెండి, రాగి కలశాలతో అక్షింతలను ఊరేగించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం 500 మంది సభ్యులు, భజన మండలి ప్రతినిధులు గ్రూపులుగా విడిపోయి ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామ నాయకులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: గ్రామ పంచాయతీలను మరింత అభివృద్ధి చేసే దిశగా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో అభివృద్ధి ప్రణాళిల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ, బ్లాక్ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అండగా 'వాహన మిత్ర'

- రాంబిల్లి మండలంలో 414 మందికి లబ్ధి
- ఐదు విడతల్లో రూ 2.07 కోట్లు జమ



ఆటోలతో వాహనమిత్ర లబ్ధిదారులు



రాంబిల్లిలో ఆటోలు

రాంబిల్లి: నిత్యం లక్షలాది మందిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తున్నా, తమ బతుకు బండిని లాగేందుకు ఇబ్బంది పడుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు వైఎస్సార్ వాహన మిత్ర అండగా నిలుస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అమలు చేయని పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారు. సొంతవాహనంతో ఉపాధి పొందుతున్న డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు బాసటగా నిలిచారు. ఏటా రూ.10వేల చొప్పున ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఐదు దఫాలుగా నగదు జమ చేశారు. రాంబిల్లి మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో 414 మంది లబ్ధిదారులు ఈ పథకం కింద ఐదు విడతల్లో రూ.2.07కోట్లు మేర లబ్ధి పొందారు.

పారదర్శకంగా ఎంపిక

గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా జన్మభూమి కమిటీలకు చేయి తడపడాలు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం అర్హత ఉంటే పథకానికి ఎంపికచేశారు.

ఇన్సూరెన్స్‌కు ఉపయోగపడింది



వాహనమిత్ర పథకం ద్వారా వచ్చిన ఆర్థికసాయాన్ని ఇన్సూరెన్స్ కట్టుకునేందుకు ఉపయోగించాను. ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందింది. దాదాపు రూ.5,500 ఇన్సూరెన్స్‌కు చెల్లించి, మిగతా సొమ్మును ఆటో నిర్వహణకు ఉపయోగించుకున్నాను. జగనన్న మా లాంటి వారందరికీ సాయం చేయడం గొప్ప విషయం

– డి. నాగభూషణం, ఆటోడ్రైవర్, రజాల

ఎంతో మేలు ..



వాహనమిత్ర పథకంతో లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో ఏ ప్రభుత్వం వాహనమిత్ర లాంటి పథకాన్ని అమలు చేయలేదు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు వాహనమిత్ర వరంలా మారింది.పాదర్శకరంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన జగనన్నకు కృతజ్ఞతలు.

– చవ్వాకుల లచ్చుబాబు, దివ్వెల ఆటో యూనియన్ అధ్యక్షుడు, దిమిలి

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



కైలాసపట్నంలో రోగికి కంటి పరీక్ష చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి



కైలాసపట్నంలో శిబిరానికి హాజరైన రోగులు

కోటవురట్ల: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి అన్నారు. కైలాసపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజల ఆరోగ్యం పట్ల ఇంతలా శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటి వద్దే వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ శానాపతి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, పెన్నాడ రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్ఈవో గోవిందరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప్పరాపల్లి, వెంకటాపురం గ్రామాల సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం తెలిపారు. ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష రెండవ విడత శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ శిబిరంలో 364 మందికి వైద్యులు వాసంతి, వెంకటరావు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

చోడవరం: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం చేశామని హెచ్‌ఎం రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు విధిగా 11 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోకి అనుమతించబోమన్నారు. హాల్ టికెట్‌తోపాటు గుర్తింపు కార్డును తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: 104 వైద్య సేవలను సద్వినియోగం చేసు కోవాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యాధికారి యామిని తెలిపారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం నిర్వహించిన 104 శిబిరంలో ఆమె వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. తోటాడ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పైడికొండ,ఏఎన్‌ఎం రమణి, ఆరోగ్య అసిస్టెంట్ విశ్వనాథం పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థాలు



తిమ్మరాజుపేటలో ఆకట్టుకుంటున్న ముగ్గులు



మునగపాకలో సేవగరిడి కళాకారులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఘనంగా తీర్థాలు నిర్వహించారు. మునగపాక మెయిన్‌రోడ్డులో పెంటకోట ఆదినారాయణ తీర్థం సందర్భంగా సేవ గరిడిల ప్రదర్శించారు. తిమ్మరాజుపేటలో వీరాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు,పాలసంఘ అధ్యక్షులు శరగడం జగన్నాథరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, వీరాంజనేయ యువజన సేవా సంఘ సభ్యులు బహుమతులు అందజేశారు.

సీఎం సమావేశానికి తరలివెళ్దాం

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: భీమిలిలో ఈ నెల 25న జరిగే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమావేశానికి తరలి వెళ్దామని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని నియోజకవర్గాల పార్టీ నాయకులతో సమావేశం కావాలని సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. 7,500 మంది కేడర్‌తో సమావేశానికి వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సీఎం సక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కు వినియోగంపై మాట్లాతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

కె౦కోట : ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆర్డీవో ఎ.జె. చిన్నికృష్ణ తెలిపారు. కె౦కోటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం స్వయం సహాయక సంఘాల మహిళలతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి శత శాతం పోలింగ్ జరగడానికి దోహదపడాలన్నారు.స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల కమిషన్ అవసరమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వడ్డాది కాటా వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట/రావికమతం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి మేరకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 కోట్లు మంజూరు చేసి ఆదుకోవడంపై రైతు సంఘ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బుచ్చెయ్యపేట, వడ్డాది, రావికమతం చెరకు కాటాల వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు విప్ ధర్మశ్రీ, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండలాధ్యక్షులు జోగా కొండబాబు, ముక్కా మహలక్ష్మి నాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు క్షీరాభిషేకాలు చేశారు. రైతు బాంధవుడిగా సీఎం వైఎస్ జగన్ నిరూపించుకున్నారని, నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ధర్మశ్రీకి రుణపడి ఉంటామని రైతులు తెలిపారు. రైతు సంఘ నాయకులు సుంకరి గాంధీ, పెదిరెడ్ల మాణిక్యం, తమరాన రమణ, బొబ్బరి ఈశ్వరరావు, నాళం శ్రీరామమూర్తి, ఈశ్వరరావు, వరహాలు, కొండయ్య, సభ్య రైతులు కొసిరెడ్డి ప్రసాద్, గొర్లె రవికుమార్, దాసరి వరహాలు, మూర్తినాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాలకు వేలం

మాడుగుల: సారాతో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు వేలం వేయనున్నామని సీఐ సింహాద్రి తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. అధిక మొత్తానికి వేలం పాడినవారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని తెలిపారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



వాడ్రాపల్లి కబడ్డీ జట్టును అభినందిస్తున్న నాయకులు, అధికారులు



తోటాడ హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ పోటీలో విజేత వమ్మవరం జట్టు

మునగపాక: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖోఖో పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. మునగపాక, నాగులాపల్లి జట్ల మధ్య పోటీ నువ్వా నేనా అన్న రీతిలో సాగింది. పోటీలను తిలకించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కబడ్డీ పోటీల్లో వాడ్రాపల్లి కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. పాటిపల్లి సచివాలయ ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించారు. వాడ్రాపల్లి జట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. విజేత జట్టు సభ్యులను శుక్రవారం పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, సచివాలయ కన్వీనర్ భీశెట్టి ధనశ్రీను, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఆడుదాం - ఆంధ్రా పోటీలు మండలంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. 25 గ్రామ సచివాలయాల పరిధిలో 25 మహిళల టీమ్‌లు, 25 పురుషుల టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయి. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహిస్తున్నారు.

ఎస్.రాయవరం: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వాలీబాల్‌లో వమ్మవరం, కబడ్డీలో వాకపాడు సచివాలయాల జట్లు విజయం సాధించాయి. తిమ్మాపురంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో విజయం సాధించిన జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడతాయని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు.

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డుదారులకు ఏడాదికి వంద రోజుల పని దినాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కె.కోటపాడులో గ్రామీణ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు పథకం, ఉపాధి హామీ, హౌసింగ్, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలపై అధికారులు వివరించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిని ఏర్పాటు చేస్తున్నట్లు జేఈ అల్లు శ్వేత తెలిపారు. గర్భిణులు, బాలింతల మెరుగైన ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, హౌసింగ్ ఏఈ నాయుడు, వ్యవసాయాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 2 వేల వ్యాధులకు చికిత్స



కైలాసపట్నంలో ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తదితరులు

కోటవురట్ల: ఆరోగ్యశ్రీ పథకంలో 2 వేల వ్యాధులకు చికిత్స పొందేలా రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చిందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. కొత్తగా వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులను కైలాసపట్నంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా క్యాన్సర్ రోగికి కూడా వైద్యం అందిస్తారని, ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి సమయంలో డాక్టర్ సూచించిన కాలం వరకు రోగికిరోజుకు రూ.225లు అందిస్తారని తెలిపారు. కైలాసపట్నంలో 555 మందికి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, ఇంకా 292 కార్డులు రావలసి ఉందని తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: స్థానిక క్యాంపు కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డైరీ, క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు కే నాగఅప్పారావు, యూనియన్ ప్రతినిధులు జి.ఎ. సత్యనారాయణ, బి. కొండలరావు, బి. రవిప్రసాద్, బి.బి. నాయుడు, కె.గోపీ, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన



శృంగవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాతవరం: ఈవీఎం ఓటింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. శుక్రవారం శృంగవరం, నాయుడుపాలెం, ముగలపూడి గ్రామాల్లో ఈవీఎంలో ఓటు వేసే విధానంపై ఓటర్లకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేసే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, జూనియర్ అసిస్టెంటు హరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడు ఉలబాల శ్రీను, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.